క్లుప్తంగా

చెక్కులు పంపిణీ చేసిన మంత్రి



అడ్డాకుల: మండలంలోని బలీదుపల్లి, ముత్యాలంపల్లికి చెందిన వారికి సీఎం సహాయనిధి చెక్కులను మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పంపిణీ చేశారు. బలీదుపల్లికి చెందిన కోట్ల సువర్ణకు రూ.లక్ష, ముత్యాలపల్లికి చెందిన వెంకట రఘురాంకు రూ.58వేలు మంజూరయ్యాయి. గురువారం వనపర్తిలోని క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు మంత్రి అందజేశారు. కార్యక్రమంలో శ్రీధర్‌యాదవ్, నర్సింహ తదితరులు ఉన్నారు.

సమ్మె నోటీసులిచ్చిన కార్మికులు



దేవరకద్ర: జూలై 6వ తేది నుంచి సమ్మెలో పాల్గొంటున్నట్లు గురువారం మండల కేంద్రం పంచాయతీ ఈఓ సీత్యానాయక్‌కు, సర్పంచ్ విజయలక్ష్మి పంచాయతీ కార్మికులు సమ్మెనోటీసు అందించారు. పంచాయతీ సిబ్బందిని క్రమబద్ధీకరించాలని, ఇతర సమస్యలన్నీ తక్షణం పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు వేణుగోపాల్ డిమాండ్ చేశారు.

అభివృద్ధికి ప్రజాప్రతినిధుల సహకారం



భూత్పూర్: గ్రామాల్లో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులకు ప్రజాప్రతినిధులు, అధికారులకు సహకరించాలని ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో అమరులవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వర్షాకాలం దృష్ట్యా ప్రజలు రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించేలా వైద్యాధికారులు, సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారుల వివరాలను సభ దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ చెన్నకిష్టన్న, ఎంపీడీఓ మున్నీ, వైస్ ఎంపీపీ నరేశ్‌గౌడ్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపండి



దేవరకద్ర: పట్టణంలో ఆర్‌ఓబీ ప్రారంభం తర్వాత ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని కొత్త బస్టాండ్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి గురువారం జిల్లా కేంద్రంలో ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ బస్సులు ప్రస్తుతం ఉన్న బస్టాండ్‌లోకి వెళ్లడం లేదని, ఆర్‌ఓబీ చివరన నిలుపుతున్నారని ఎమ్మెల్యే తెలిపారు. రెండు వైపుల రిక్వెస్ట్ స్టాపులను ఏర్పాటు చేసి తాత్కాలిక షెడ్లను నిర్మించాలని అధికారులకు సూచించారు అలాగే బస్టాండ్ నిర్మాణం కోసం ఎంపిక చేసిన స్థలంలో ఆధునిక సౌకర్యాలతో ఉండే విధంగా వెంటనే ప్రతిపాదనలు పంపాలని తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఆర్టీసీ డీఎం సుజాత, సీఐ రాంజీ ఉన్నారు.

'గృహలక్ష్మి పథకం డబ్బులు సరిపోవు'



జడ్చర్ల: ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిన గృహలక్ష్మి పథకం కింద ఇచ్చే రూ.3లక్షలు ఏమాత్రం సరిపోవని రూ.5లక్షలు అందించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పాతబజార్‌లో ఇళ్లు లేని నిరుపేదలతో సమావేశమయ్యారు. రేషన్‌కార్డులు, పింఛన్లు, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈనెల 26న స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జడ్చర్ల టౌన్: దశాబ్ది ఉత్సవాలు అంటూ ప్రభుత్వం ఆర్భాటం చేయటంతోపాటు ప్రజా సమస్యలపై దృష్టిసారించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్ డిమాండ్ చేశారు. ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గురువారం మండలంలోని కిష్టంపల్లిలో సమస్యలపై సర్వే నిర్వహించారు. పేదలకు రేషన్‌కార్డులు, ఆసరా, వితంతు పింఛన్లు మంజూరు చేయాలన్నారు. గ్రామంలో నిర్మించిన 24 డబుల్ బెడ్రూం ఇళ్లను నిరుపేదలకు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సాయిలు, సుందరమ్మ, శివకుమార్ పాల్గొన్నారు.



గాధిర్యాల్ పాఠశాలలో మౌనం పాటిస్తున్న విద్యార్థులు



కోయిల్‌కొండలో నివాళులర్పిస్తున్న అధికారులు



మూసాపేటలో ఉద్యమకారుడిని సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు



అడ్డాకులలో..

అమరుల త్యాగాలు మరువలేం

మహమ్మదాబాద్: అమరుల త్యాగాలను ఎన్నడూ మరువలేమని గాధిర్యాల్ సర్పంచ్ వెంకట్రాంరెడ్డి తెలిపారు. అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం గ్రామంలో పలు గ్రామాల్లోని పాఠశాలల్లో విద్యార్థులు అమరులకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు. ఎంపీపీ శశికళ మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రంకోసం ఉద్యమంలో ఎంతో మంది అమరులు ప్రాణాలు త్యాగం చేశారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జయరాములు, డీటీ మురళీ, సూపరింటెండెంట్ హరిశ్చంద్రారెడ్డి, సర్పంచ్ నారాయణ పాల్గొన్నారు.

అడ్డాకుల: అడ్డాకుల, మూసాపేట మండల కేంద్రాల్లో గురువారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అమరవీరులకు నాయకులు, అధికారులు నివాళులర్పించారు. మూసాపేట రైతువేదికలో తెలంగాణ ఉద్యమకారుడు పల్లి శివరాములు యాదవ్‌ను సత్కరించారు. కార్యక్రమాల్లో ఎంపీపీలు నాగార్జున్‌రెడ్డి, కళావతి, ఎంపీడీఓలు మంజుల, స్వరూప, తహసీల్దార్ మంజుల, డీటీ శ్రీనివాస్, విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, ఖాజాఫెరీ, మదీనా జమీర్ తదితరులు ఉన్నారు.

నవాబుపేట: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, నాయకులు శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య, ఎంపీపీ అనంతయ్య, వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రాజాపూర్: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఎందరో అమరులయ్యారని వారి త్యాగ ఫలితమే ప్రత్యేక రాష్ట్రమని ఎంపీడీఓ లక్ష్మీదేవి అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో ముందుగా అమరవీరులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. తహసీల్దార్ రాంబాయి, ఎంపీపీ సుశీల పాల్గొన్నారు.

జడ్చర్ల: అమరవీరుడు శ్రీకాంతాచారి విగ్రహానికి గురువారం స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ సారిక, వార్డు కౌన్సిలర్లు జ్యోతి, చైతన్య, ప్రశాంత్, నంద, మహేష్, రమేష్, శశి కిరణ్, చౌహాన్, ఉమాశంకర్ పాల్గొన్నారు.

బాలానగర్: అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని ఎంపీపీ కమల అన్నారు. గురువారం ప్రత్యేక మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణారావు, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి హాజరై అమరవీరుల స్థూపం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఉషారాణి, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ సువర్ణరాజు, అధికారులు పాల్గొన్నారు.



జడ్చర్లలో శ్రీకాంతాచారి విగ్రహానికి పూలమాల వేస్తున్న చైర్‌పర్సన్ లక్ష్మి

దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలో గురువారం అమర వీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. పంచాయతీ సమీపంలో ఉన్న అమర వీరుల స్మారక స్థూపం వద్ద పలువురు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి, ఈఓ సీత్యానాయక్, బాల్‌రాజు, యుగంధర్‌రెడ్డి, పాల్గొన్నారు.



నవాబుపేటలో..



రాజాపూర్‌లో..



బాలానగర్‌లో మౌనం పాటిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



దేవరకద్రలో అమర వీరుల స్థూపం వద్ద..

త్వరలోనే కార్పొరేషన్‌గా మారుస్తాం



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: త్వరలోనే పాలమూరును కార్పొరేషన్‌గా మారుస్తామని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం తెలంగాణ అమరవీరులను స్మరించుకునేందుకు స్థానిక మున్సిపల్ కౌన్సిల్ ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా అమరులకు రెండు నిమిషాల పాటు మంత్రితో పాటు కౌన్సిల్ సభ్యులందరూ మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పట్టణంలో అన్ని వర్గాలకు సామూహిక భవనాలను నిర్మిస్తున్నామన్నారు. తెలంగాణ వచ్చాకే మహబూబ్‌నగర్ మున్సిపాలిటీకి రూ.వందల కోట్లు తీసుకొచ్చి ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. సమావేశంలో చైర్మన్ నర్సింహులు, వైస్‌చైర్మన్ గణేష్‌కుమార్, కమిషనర్ ప్రదీప్ కుమార్, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడారంగంలో దేశానికే ఆదర్శం

మహబూబ్‌నగర్ రూరల్: దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించేందుకు అన్ని గ్రామాలలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశామని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ క్రీడల్లో దూసుకుపోతుందని తెలిపారు. గురువారం మండలంలోని మాచన్‌పల్లి తండాలో నిర్వహించిన వీఎంఆర్ క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి మంత్రి బహుమతులను అందజేశారు. మంత్రి మాట్లాడుతూ క్రీడారంగంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని, క్రీడాకారులకు అద్భుతమైన సౌకర్యాలను కల్పించడం వల్ల నికత్ జరీన్ వంటి క్రీడా ఆణిముత్యాలు వెలుగులోకి వస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, ముడా చైర్మన్ గంజి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నాన్‌టీచింగ్ సిబ్బంది మద్దతు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో కొంతకాలంగా తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ కాంట్రాక్టు అధ్యాపకులు చేస్తున్న నిరసన కార్యక్రమానికి నాన్‌టీచింగ్ సిబ్బంది గురువారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా టీచింగ్ సంఘం అధ్యక్షుడు భూమయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో కాలంగా కాంట్రాక్టు అధ్యాపకులుగా పని చేస్తున్న తమను గుర్తించి వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాన్‌టీచింగ్ సంఘం అధ్యక్షుడు రామ్మోహన్ జీ, కిరణ్, సత్యం, రాము, అరుణ, టీచింగ్ సిబ్బంది రవికుమార్, సుదర్శన్‌రెడ్డి, పాల్గొన్నారు.

విద్యాశాఖ తీరు అవమానకరం

నవాబుపేట: విద్యాశాఖ తీరు మండలంలో అవమానకరమని మండల సభలో ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పదో తరగతి ఫలితాల్లో కొల్లూర్ పాఠశాలలో ఒకరు, చౌడూర్‌లో 2 విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా, పోమాల్‌లో అందరూ ఫెయిల్ అయ్యారని ఇది మండలానికి తీవ్ర అవమానమని కొల్లూర్ ఎంపీటీసీ తులసీరాంనాయక్, చౌడూర్ ఎంపీటీసీ గోపికృష్ణ, సర్పంచ్‌లు సత్యం, వెంకటేష్ అధికారులను నిలదీశారు. దీనికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఇన్‌చార్జ్ అధికారితో మండలంలో విద్యావ్యవస్థ చాలా దారుణంగా ఉందని, పర్యవేక్షణ కరువైందని ఆరోపించారు. అలాగే ఉపాధి హామీ పథకంలో గతంలో నిర్మించిన ఇంకుడు గుంతల బిల్లులు, మరుగుదొడ్ల బిల్లులు, ఇటీవల నిర్మించిన క్రీడాప్రాంగాణాల బిల్లులు అందలేదని సర్పంచ్‌లు యాదయ్య, గోపాల్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ రాంచంద్రయ్య తెలిపారు. తాము రూ.లక్షలు పెట్టి అధికారులు చెప్పినట్లు పనులు చేస్తే తీరా బిల్లుల విషయం వచ్చేసరికి పట్టించుకోవడం లేదన్నారు.



సభలో అధికారులను నిలదీస్తున్న ప్రజాప్రతినిధులు

అధికారులు ఎక్కువ సభ్యులు తక్కువ

మండల సభలో 42 మంది సర్పంచ్‌లకు గాను ఏడుగురు మాత్రమే హాజరు కాగా కొండాపూర్, వెంకటేశ్వరతండా, కాకర్లపహడ్ మహిళా సర్పంచ్‌లకు బదులు వారి భర్త, కుమారులు పాల్గొన్నారు. అలాగే 19 మంది ఎంపీటీసీలకు ఐదుగురు, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు హాజరయ్యారు. సమావేశంలో సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య, వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, తహసీల్దార్ రాజేందర్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీలత, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిపై వివాదం

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని సర్వే నంబర్ 67లో ఉన్న ప్రభుత్వ భూమి వద్ద గురువారం వివాదం ఏర్పడింది. రైతు వేదిక పక్కన ఉన్న స్థలంలో గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి బాలయ్య గురువారం కంచె ఏర్పాటు చేసేందుకు యత్నించారు. దీంతో పంచాయతీ కార్యదర్శి మహేందర్, రైతుబంధు అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, నాయకులు శెట్టిశ్రావన్, కొండయ్య, కోఆప్షన్ సభ్యుడు జమీర్, ఉప సర్పంచ్ తాజోద్దిన్ వెళ్లి అడ్డుకున్నారు. పంచాయతీ తీర్మానం లేకుండా ప్రభుత్వ భూమిలో కంచె ఎలా ఏర్పాటు చేస్తారని గ్రామస్తులు ప్రశ్నించడంతో కొంతసేపు ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. భూమిని తమకు కేటాయించినట్లు ఉన్నతాధికారుల ఆదేశాలు ఉన్న పత్రాలు తన వద్ద ఉన్నట్లు బాలయ్య చెప్పగా, ఇప్పటి వరకు మీ ఆధీనంలో ఉన్న భూమి వరకు మాత్రమే కంచె ఏర్పాటు చేసుకోవాలని గ్రామస్తులు పట్టుబట్టారు. కంచె ఏర్పాటు చేసే స్థలాన్ని హెల్త్ సబ్ సెంటర్, బ్యాంకు అవసరాల కోసం కేటాయించినట్లు నాయకులు తెలిపారు.



మూసాపేటలో ప్రభుత్వ భూమి వద్ద గ్రామస్తులు

బీఆర్‌ఎస్ పాలనలో దగాపడ్డ తెలంగాణ

దేవరకద్ర: తొమ్మిదేళ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ దగాపడిందని డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. గురువారం నియోజకవర్గ కేంద్రంలో దశాబ్ది దగా పేరుతో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కొత్త బస్టాండ్ చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు చేసింది తక్కువ చెప్పేది ఎక్కువ అని విమర్శించారు. కేజీ నుంచి పీజీ ఉచిత విద్య, నిరుద్యోగ భృతి, రైతురుణమాఫీ, ఉద్యోగాల కల్పన, డబుల్ బెడ్‌రూమ్‌లు, మూడెకరాల భూమి, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇంటికో ఉద్యోగం, పోడు భూములకు పట్టాలు, 12 శాతం ముస్లిం రిజర్వేషన్, దళిత ముఖ్యమంత్రి ఇలా దశాబ్ది దగా చేసిన కేసీఆర్ ప్రజలను నట్టేటా ముంచి ఉత్సవాలు చేస్తున్నారని ఆరోపించారు. మరో నాలుగు నెలల్లో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని అప్పటి వరకు ఉద్యమాలతో కదం తొక్కాలని కోరారు. ముందుగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కొత్త బస్టాండ్ రోడ్డుపై నిరసన, రాస్తారోకో చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించి వినతి పత్రం ఇచ్చారు. అనంతరం కొత్త బస్టాండ్ చౌరస్తాలో కేసీఆర్ పది తలల దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో శంకర్, ప్రదీప్‌కుమార్‌గౌడ్, ప్రశాంత్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి, ప్రశాంత్, రాందాసు, భారతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనకు ముగింపు ఉత్సవాలు..

జడ్చర్ల: ప్రభుత్వం చేపట్టిన దశాబ్ది ఉత్సవాలు బీఆర్‌ఎస్ పాలనకు చరమగీతం పాడే ఉత్సవాలు కానున్నాయని టీపీసీసీ సెక్రటరీ అనిరుధ్‌రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలో చేపట్టిన నిరసన కార్యక్రమం సందర్భంగా ఆయన మాట్లాడారు. అమరుల త్యాగాలు, సోనియాగాంధీ చలువతో రాష్ట్రం ఏర్పాటైందని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారని విమర్శించారు. నియోజకవర్గంలో అభివృద్ధి జాడ లేదని, భగీరథ తాగు నీరు మురికి నీరుగా మారిందని, వర్షం వస్తే బురదమయంగా పట్టణం తయారవుతుందని ఆరోపించారు.



దేవరకద్రలో కేసీఆర్ దిష్టిబొమ్మతో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

హరితవనంగా రెవెన్యూ కార్యాలయం

బాలానగర్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం పచ్చని చెట్లతో హరితవనంగా మారింది. పదేళ్ల క్రితం నాటిన మొక్కలు వాటిని అధికారులు కాపాడుకుంటూ వస్తున్నారు. మొక్కలపై ప్రత్యేక శ్రద్ధ వహించడంతో 30–35 ఫీట్ల మేర ఏపుగా పెరిగాయి. ప్రస్తుత ఆర్‌ఐ వెంకట్‌రెడ్డి, డీటీ దేవేందర్ కేసిరెడ్డి మరింత చొరవతో కార్యాలయ ప్రాంగణంలో చెట్ల కింద సిమెంట్ కుర్చీలు, చలివేంద్రం, సీసీ ఏర్పాటు చేశారు. అంతేకాకుండా పక్క కార్యాలయాలకు వచ్చిన ప్రజలు సైతం వారి వాహనాలను తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో చెట్ల కింద నిలిపి అక్కడే కుర్చీలపై వేచి ఉంటున్నారు.



పచ్చటి చెట్ల మధ్యలో తహసీల్దార్ కార్యాలయం

సేవ చేసేందుకు వీలుగా..

కార్యాలయానికి వచ్చిన ప్రజలకు మౌలిక సదుపాయలు, చల్లటి వాతావరణం ఉండాలని చెట్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాం. వారంలో రెండు రోజులు చెట్లకు నీరు పట్టి కాపాడుతున్నాం. ఏదైనా పనులపై గ్రామాలకు వెళ్లిన అధికారుల కోసం ప్రజలు వేచి ఉండాల్సిన పరిస్థితికి అనువైన వాతావరణం ఏర్పాటు చేయాలని సీసీ ఏర్పాటుతోపాటు చెట్ల కింద కుర్చీలు, చలివేంద్రం ఏర్పాటు చేశాం.

– శ్రీనివాస్, తహసీల్దార్, బాలానగర్

ప్రతి ఇంటికీ కేంద్ర ప్రభుత్వ పథకాలు



హన్వాడలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

హన్వాడ: ప్రతి ఇంటికీ కేంద్ర ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని బీజేపీ జిల్లా కార్యదర్శి కొండా బుచ్చిరెడ్డి తెలిపారు. ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలో పర్యటించారు. రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న పథకాలన్నీ కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చినవేనని తెలిపారు. కార్యక్రమంలో వెంకటయ్య, మహేందర్‌రెడ్డి, కావలి శ్రీను, కేశవులు, వేణు తదితరులు పాల్గొన్నారు.

భూత్పూర్: పట్టణంలోని వివిధ వార్డుల్లో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిపై బీజేపీ ఆధ్వర్యంలో గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో 9 ఏళ్లలో బీజేపీ ప్రభుత్వం, ప్రధాన మంత్రి మోడీ పాలనలో పథకాలపై ఇంటింటా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సత్తయ్యగౌడ్, నరేందర్ రాము, నర్సింహ, చంటి తదితరులు ఉన్నారు.

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. 149, 150, 151, 152 పోలింగ్ బూత్‌లలో కరపత్రాలు పంపిణీ చేశారు. పట్టణ అధ్యక్షుడు నాగరాజు, నరేష్, నవీన్, కిట్టు, మల్లేష్ పాల్గొన్నారు.

మిడ్జిల్: ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. మండల కేంద్రంలో ప్రతి ఓటరును, ప్రతి ఇంటిని కలిసి 9 ఏళ్ల బీజేపీ పాలనపై ప్రజలకు వివరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అంజి, జంగయ్య, శేఖర్, నవీన్, సాయిలు పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: బీజేపీ ప్రభుత్వ పాలనలోనే దేశం అభివృద్ధి చెందిందని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నంబిరాజు అన్నారు. పార్టీ చేపట్టిన మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.



జమిస్తాపూర్‌లో కరపత్రాలు పంచుతున్న బీజేపీ నాయకులు

రైతుల సంక్షేమానికి పెద్దపీట

మహబూబ్‌నగర్ రూరల్: రైతుల సంక్షేమం కోసం మోదీ ప్రభుత్వం అహర్నిషలు కృషి చేస్తుందని నాయకులు అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సుపరిపాలన తొమ్మిదేళ్లు పూర్తయిన సందర్భంగా మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా గురువారం మండలంలోని జమిస్తాపూర్, గాజులపేట గ్రామాలలో బీజేపీ ఇంటింటికి కార్యక్రమాన్ని చేపట్టింది. జిల్లా కోశాధికారి పాండురంగారెడ్డి, రాజుగౌడ్, సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డిలు ఇంటింటికి వెళ్లి పథకాల గురించి వివరించారు.